www.aksharadarbar.com
బుధవారం 27, మార్చి 2024
అక్షర దర్బార్
voice of the people
తెలుగు దినపత్రిక వరంగల్ | సంచిక :50 | సంపుటి :02 | పేజీలు : 05 | వెల : 05

ఛత్తీస్ ఘడ్ లో భారీ ఎన్ కౌంటర్

ఆరుగురు మావోయిస్టుల మృతి

03



తెలంగాణలో మరోసారి జిల్లాల పునర్విభజన జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. తాజాగా ఈ అంశం హాట్ టాపిక్ గా మారింది. 17 లోక సభ నియోజకవర్గాల వారీగా కొత్త జిల్లాలు ఏర్పాటు చేస్తారని రాజకీయ వర్గాలు చర్చించుకుంటున్నాయి. పార్లమెంట్ ఎన్నికల తర్వాత ఈ ప్రక్రియ మొదలయ్యే అవకాశం ఉందని జోరుగా ప్రచారం జరుగుతున్నది. ఇదే విషయాన్ని ఓ ఆంగ్ల ప్రతిక ప్రచురించినా రాష్ట ప్రభుత్వం స్పందించకపోవడం ప్రచారానికి బలం చేకూర్చినట్లయింది. 2016 అక్టోబర్ లో కొత్తగా 33 జిల్లాల ఏర్పాటు జరిగింది. అయితే అవసరం లేకున్నా.. ప్రజల డిమాండ్లకు అనుగుణంగా కొన్ని జిల్లాలను ఏర్పాటు చేశారనే వాదన ఉంది. దాదాపు అన్ని జిల్లాలో కొత్త కలెక్టరేట్లు, ప్రభుత్వ కార్యాలయాలు ఏర్పాటయ్యాయి. తాజాగా జిల్లాల సంఖ్యను 17 కు తగ్గిస్తారని చర్చ జరగడం కొన్ని ప్రాంతాల ప్రజలకు మింగుడు పడటం లేదు.

- అక్షర దర్బార్, వరంగల్ ప్రతినిధి

తెరపైకి జిల్లాల పునర్విభజన?

- 17 లోక సభ నియోజకవర్గాల వారీగా కొత్త జిల్లాలు..!
- ఇందుకోసం కమిటీ వేసే యోచనలో కాంగ్రెస్ ప్రభుత్వం

02

- ఇదే జరిగితే రెండేళ్ల వరకు ఉద్యోగ నోటిఫికేషన్లు వచ్చే అవకాశం లేదు..!
- జోన్ లు, మల్టీ జోన్ల లో మార్పులు తథ్యం
- పడిపోనున్న రియల్ ఎస్టేట్ వ్యాపారం..

దళారులను ఆశ్రయించొద్దు

- ఆన్‌లైన్ లో స్లాట్ బుక్ చేసుకుని నేరుగా పనులు చేసుకోవచ్చు
- అందుబాటులో పద్దెనిమిది రకాల సేవలు
- పోస్టు ద్వారా లైసెన్సు, ఆర్సీ అందని వాహనదారులు ఆఫీసులో పొందవచ్చు
- క్వార్టర్లీ ట్యాక్స్ ఏప్రిల్ నెలాఖరులోగా చెల్లించాలి

05

- 'అక్షర దర్బార్' తో డీటీసీ డాక్టర్ పుప్పాల శ్రీనివాస్

హనుమకొండ చింతగట్టు కేంద్రంగా పని చేస్తున్న రవాణా శాఖ జిల్లా కార్యాలయం ఇన్నాళ్లు అవినీతికి కేరాఫ్ గా నిలిచింది. లైసెన్స్, రిజిస్ట్రేషన్, ఇతర పనుల కోసం వాహనదారులు ఈ కార్యాలయంలో దళారులను ఆశ్రయించారు. ఇక్కడ వాహనదారులు ఈ కార్యాలయంలో బ్రోకర్లను సంప్రదించకుండా నేరుగా అధికారులను కలిస్తే పనులు జరగని పరిస్థితి కొనసాగింది. ప్రతి పనికి ఒక రేటు ఫిక్స్ చేసి వసూళ్లకు పాల్పడటం ద్వారా దళారులు వాహనదారుల జేబులను లూటీ చేశారు. ఇటీవల బదిలీపై ఇక్కడికి రవాణా శాఖ వరంగల్ ప్రాంతీయ డిప్యూటీ కమిషనర్ (డీటీసీ)గా వచ్చిన డాక్టర్ పుప్పాల శ్రీనివాస్ హనుమకొండ ఈ కార్యాలయంలో అవినీతి మరకలను తుడిచి వేసే పనిలో పడ్డారు. ఆర్టీవో కార్యాలయంలో తమ పనుల కోసం వాహనదారులు ఎవరు కూడా దళారులను ఆశ్రయించవద్దని చెపుతున్నారు. నేరుగా ఆన్ లైన్ లో స్లాట్ బుక్ చేసుకుని ఈ కార్యాలయంలో సులువుగా తమ పనులు చేసుకోవాలని కోరుతున్నారు. ఇందుకోసం అవసరమైన ఏర్పాట్లు చేశామని అంటున్నారు. ముఖ్యంగా అనేక ఆరోపణలు ఎదుర్కొంటున్న ఈ కార్యాలయంలో వాహనదారులకు రవాణా శాఖ నుంచి మెరుగైన సేవలను అందించే దిశగా అడుగులు వేస్తున్నారు. వాహనదారులు తమ ఆఫీసులో సమస్యలేమైనా ఎదురైతే తనను కలవచ్చని డీటీసీ డాక్టర్ పుప్పాల శ్రీనివాస్ అన్నారు. గత ఫిబ్రవరి 19న ఇక్కడ డీటీసీగా బాధ్యతలు చేపట్టిన ఆయన బుధవారం 'అక్షర దర్బార్' తో మాట్లాడారు.

— అక్షర దర్బార్, వరంగల్ ప్రతినిధి

వచ్చే ఏడాదిలో ఎమ్మెల్సీగా కొండా మురళీ

- స్పష్టం చేసిన మంత్రి సురేఖ
- ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని ప్రారంభించిన కొండా దంపతులు

04

బీఆర్ఎస్ తోనే రంజిత్ రెడ్డికి గుర్తింపు

- చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గం నేతలతో కేటీఆర్ సమావేశం
- కాంగ్రెస్ లో చేరిన ఎంపీపై ఘాటు వ్యాఖ్యలు

03

బతకడానికి వచ్చి బలవన్మరణం

జనగామలో తమిళనాడుకు చెందిన దంపతుల ఆత్మహత్య

03

31న సీఈసీ సమావేశం

- 8 నియోజకవర్గాలకు కాంగ్రెస్ పార్టీలో
- ఎటూ తేలని అభ్యర్థులు

05

అక్షర దర్బార్
voice of the people
తెలుగు దినపత్రిక

తెరపైకి జిల్లాల పునర్విభజన..

17 లోక సభ నియోజకవర్గాల వారీగా కొత్త జిల్లాలు..!

అక్షర దర్బార్, వరంగల్ ప్రతినిధి:

తెలంగాణలో మరోసారి జిల్లాల పునర్విభజన జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. తాజాగా ఈ అంశం హాట్ టాపిక్ గా మారింది. 17 లోక సభ నియోజకవర్గాల వారీగా కొత్త జిల్లాలు ఏర్పాటు చేస్తారని రాజకీయ వర్గాలు చర్చించుకుంటున్నాయి. పార్లమెంట్ ఎన్నికల తర్వాత ఈ ప్రక్రియ మొదలయ్యే అవకాశం ఉందని జోరుగా ప్రచారం జరుగుతున్నది. ఇదే విషయాన్ని ఓ ఆంగ్ల పత్రిక ప్రచురించినా రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోవడం ప్రచారానికి బలం చేకూర్చినట్లయింది. 2016 అక్టోబర్లో కొత్తగా 33 జిల్లాల ఏర్పాటు జరిగింది. అయితే అవసరం లేకున్నా.. ప్రజల డిమాండ్లకు అనుగుణంగా కొన్ని జిల్లాలను ఏర్పాటు చేశారనే వాదన ఉంది. దాదాపు అన్ని జిల్లాల్లో కొత్త కలెక్టరేట్లు, ప్రభుత్వ కార్యాలయాలు ఏర్పాటయ్యాయి. తాజాగా జిల్లాల సంఖ్యను 17 కు తగ్గిస్తారని చర్చ జరగడం కొన్ని ప్రాంతాల ప్రజలకు మింగుడు పడటం లేదు.

ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలున్న సికింద్రాబాదు లోక్ సభ స్థానాన్ని జిల్లాగా ఏర్పాటు చేయలేదు. కానీ తొమ్మిది మండలాలతో ములుగును కొత్త జిల్లాగా ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలోనే రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చిన కొద్ది రోజులకే జిల్లాల స్వరూపాన్ని మార్చేస్తామనే సంకేతాలిచ్చారు. జిల్లాలు, రెవెన్యూ డివిజన్ల విభజన, మండలాల పునర్విభజనపై ఓ కమిషన్ ఏర్పాటు చేస్తామని సీఎం పగ్గాలు చేపట్టిన తొలి రోజుల్లో రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు చేశారు. అశాస్త్రీయంగా 33 జిల్లాల ఏర్పాటు జరిగిందని ఆయన ఓ సందర్భంలో పేర్కొన్నారు. జిల్లాల తగ్గింపునకు కమిషన్ వేయనున్నారు. కమిషన్ ఇచ్చే నివేదిక ప్రకారం జిల్లాలు ఏర్పాటు చేస్తామని సీఎం గతంలో చెప్పారు. ప్రస్తుతం ఉన్న 33 జిల్లాలను కాస్తా 17కి కుదిస్తారనే ప్రచారం జరుగుతున్నది. జిల్లాల సంఖ్య తగ్గించడం ఆలోచనే కొద్దిసేపు పక్కన పెడితే.. లోక్ సభ నియోజకవర్గాలను జిల్లాలుగా మార్చడం ద్వారా కొత్త సమస్యలు తలెత్తే అవకాశమూ లేకపోలేదు.

- కమిటీ వేసే యోచనలో కాంగ్రెస్ ప్రభుత్వం
- ఇదే జరిగితే రెండేళ్ల వరకూ ఉద్యోగ నోటిఫికేషన్లు వచ్చే అవకాశం లేదు!
- జోన్లు, మల్టీజోన్లలో మార్పులు తథ్యం
- పడిపోనున్న రియల్ ఎస్టేట్ వ్యాపారం..

ఇదీ పరిస్థితి..

ఉదాహరణకు మహబూబాబాద్ లోక్ సభ స్థానాన్ని తీసుకుంటే ఈ నియోజకవర్గం పరిధిలో డోర్నకల్, మహబూబాబాద్, నర్సంపేట, ములుగు, పినపాక, ఇల్లెందు, భద్రాచలం అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని వాజేడు, వెంకటాపురం మండలాలు ములుగు జిల్లాలో ఉన్నాయి. ఇప్పుడు మహబూబాబాదును జిల్లాగా మారిస్తే వాజేడు నుంచి మహబూబాబాద్ వెళ్లాలంటే 165 కి.మీ. ప్రయాణించాలి. భద్రాచలం, మహబూబాబాద్ మధ్య దూరం 110 కి.మీ. పైనే ఉంటుంది. ఇలాంటి సందర్భాల్లో జిల్లాల పునర్విభజన పెద్దగా ఆశించిన ప్రయోజనం ఉండదని చాలా మంది అభిప్రాయం. ప్రస్తుతం ఉన్న జిల్లాల సరిహద్దుల్లో మార్పులు చేస్తారని తొలుత భావించినా.. తాజాగా పునర్విభజనే చేస్తారని వివిధ పార్టీల నేతలు చర్చించుకుంటున్నారు. భూపాలపల్లి నియోజకవర్గంలోని శాయంపేట మండలం హనుమకొండ జిల్లా పరిధిలో ఉంది. జనగామ జిల్లాలోని పాలకుర్తి నియోజకవర్గం జనగామ, వరంగల్, మహబూబాబాద్ జిల్లాల్లో విస్తరించి ఉంది. కొత్తగూడ, గంగారం మండలాలు మహబూబాబాద్ జిల్లా పరిధిలో ఉన్నాయి. కానీ ఈ గ్రామాలు ములుగు నియోజకవర్గంలో ఉన్నాయి. ఇలా ఇబ్బంది ఉన్న కొన్ని చోట్ల మార్పులు చేర్పులు చేస్తే సరిపోతుంది. జిల్లాల పునర్విభజన చేస్తే మళ్ళీ అంతా అయోమయానికి గురికావాల్సిందేనని మేధావుల అంటున్నారు.

జిల్లాలోని చివరి మండలానికి ఉన్న దూరాన్ని పరిగణనలోకి తీసుకొని ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. ప్రస్తుతం దాదాపు అన్ని జిల్లాల్లో నూతన కలెక్టరేట్లు, ప్రభుత్వ కార్యాలయాలు ఏర్పాటయ్యాయి. కొత్త జిల్లాల అభివృద్ధి ఇప్పుడిప్పుడే జరుగుతున్నది. రియల్ ఎస్టేట్ వ్యాపారం జోరుగా అందుకుంటున్న క్రమంలో జిల్లాల కుదింపు వార్త చిన్న జిల్లాల ప్రజల్లో ఆందోళన కలిగిస్తున్నది. జిల్లాలను కుదిస్తే ఇప్పట్లో ప్రభుత్వ ఉద్యోగం నోటిఫికేషన్లు వచ్చే అవకాశం లేదని నిరుద్యోగులు అభిప్రాయపడుతున్నారు. జోన్లు, మల్టీజోన్లు మార్పులు చేయాల్సి రావడం తథ్యమవుతుంది. దీంతో ప్రభుత్వ ఉద్యోగుల బదిలీల్లో కొత్తగా కసరత్తు చేయాల్సి ఉంటుంది అంతా గందరగోళం అయ్యే పరిస్థితి ఏర్పడుతుంది. పునర్విభజన జరిగితే ఆసిఫాబాద్, నిర్మల్, జగిత్యాల, మంచిర్యాల, సిరిసిల్ల, సంగారెడ్డి, సిద్దిపేట, కామారెడ్డి, వికారాబాద్, రంగారెడ్డి, నారాయణపేట, గద్వాల్, వనపర్తి, జనగాం, సూర్యాపేట, భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలు ఉండవని ప్రచారం జరుగుతోంది.

సీపీకి వివరిస్తున్న ఇన్ స్పెక్టర్ రఘు

చెక్ పోస్టును తనిఖీ చేసిన సీపీ

అక్షర దర్బార్, వరంగల్ ప్రతినిధి : లోక్ సభ ఎన్నికల నేపథ్యంలో ఏర్పాటు చేసిన చెక్ పోస్టులను వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా బుధవారం తనిఖీ చేశారు. జనగామ పోలీస్ స్టేషన్ పరిధిలోని జిల్లా సరిహద్దు పెంబర్తి ఎన్నికల చెక్ పోస్టును కమిషనర్ ఆకస్మికంగా తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా సిబ్బంది నిర్వహిస్తున్న తనిఖీ తీరును సీపీ పరిశీలించారు. తనిఖీ సమయాల్లో ప్రజలతో సిబ్బంది మార్యాదపూర్వకముగా వ్యవహరించాలని, వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జాగ్రత్త పడాలని సూచించారు. అప్రమత్తంగా విధులు నిర్వహించాలని సూచించారు. సీపీవెంట జనగామ ఇన్ స్పెక్టర్ రఘు ఉన్నారు.

పారదర్శకంగా విచారణ చేపట్టాలి

భూపాలపల్లి ఎస్పీ కిరణ్ ఖరే

అక్షర దర్బార్, జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి : ప్రతి కేసులో పారదర్శకంగా విచారణ చేపట్టి, బాధితులకు న్యాయం చేయాలని జయశంకర్ భూపాలపల్లి ఎస్పీ కిరణ్ ఖరే అన్నారు. జిల్లా పోలీస్కార్యాలయంలోని కాన్ఫరెన్స్హాల్లో బుధవారం జిల్లా పరిధిలోని డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలతో ఎస్పీ కిరణ్ ఖరే సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయా పోలీస్స్టేషన్లలో నమోదైన కేసులను పరిశీలించారు. ఆయా కేసులకు సంబంధించి అధికారులు సేకరిస్తున్న అధారాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ కిరణ్ ఖరే మాట్లాడుతూ పార్లమెంట్ఎన్నికల దృష్ట్యా అవాంఛనీయ ఘటనలు జరుగకుండా పోలీస్అధికారులు సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలన్నారు. పాత నేరస్తులు, సమస్యాత్మక వ్యక్తులు, రౌడీషీటర్ల కదలికలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ, ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలన్నారు. మద్యం, నగదు అక్రమ రవాణాను నిరోధించడంలో భాగంగా చెక్పోస్టులలో విధులు నిర్వర్తించే సిబ్బందిని ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలని సూచించారు. సరిహద్దు రాష్ట్రాల పోలీస్అధికారులతో సమన్వయంతో విధులు నిర్వర్తించాలని, ఎవరైనా సరైన ఆధారాలు లేకుండా రూ.50 వేలకు మించి నగదును రవాణా చేస్తూ పట్టుబడితే, ఎన్నికల నియమావళి ప్రకారం కేసులు నమోదు చేయాలని పేర్కొన్నారు. కేసుల విచారణలో జాప్యం చేస్తే సహించేది లేదని, విధుల్లో అలసత్వం ప్రదర్శిస్తే క్రమశిక్షణా చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో భూపాలపల్లి, కాటారం వర్టికల్ డీఎస్పీలు ఏ.సంపత్ రావు, జి.రామ్మోహన్ రెడ్డి, నారాయణ నాయక్, డీసీఆర్బీ, ఎస్బీ ఇన్స్పెక్టర్లు రామకృష్ణ, వసంత్ కుమార్, భూపాలపల్లి, కాటారం చిట్యాల, మహాదేవ్ పూర్ సీఐలు నరేష్ కుమార్, నాగార్జున రావు, మల్లేష్ , రాజేశ్వర్ రావు, ఎస్సైలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎస్పీ, పాల్గొన్న అధికారులు

దానంపై హైకోర్టులో పిటిషన్

అనర్హత వేటు వేయాలన్న పిటిషనర్

అక్షర దర్బార్, హైదరాబాద్ : ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ కు వ్యతిరేకంగా తెలంగాణ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. ఆయనపై అనర్హత వేటు వేయాలని రాజు యాదవ్ అనే వ్యక్తి పిటిషన్ దాఖలు చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పా ర్టీ తరుపున గెలుపొందిన దానం నాగేందర్ ఖైరతాబాద్ ఎమ్మె ల్యేగా కొనసాగుతున్నారు. కొద్దిరోజుల క్రితం కాంగ్రెస్ పార్టీలో చేరిన దానం నాగేందర్ ప్రస్తుతం సికింద్రాబాద్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా బరిలో నిలిచారు. ఒక పార్టీ నుంచి ఎమ్మెల్యేగా గెలిచి రాజీనామా చేయకుండా మరో పార్టీ నుంచి ఎంపీగా పోటీ చేయడం చట్టపరంగా రాజ్యాంగ విరుద్ధమని పిటిషనర్ పేర్కొన్నారు. నాగేందర్పై స్పీకర్ చర్యలు తీసుకోవాలని కోరుతూ పిటిషన్లో పేర్కొన్నారు. దానంపై అనర్హత వేటు వేయాల్సిందిగా స్పీకరుకు ఆదేశాలు ఇవ్వాలని రాజు యాదవ్ కోరారు. దీనిపై గురువారం విచారణ జరిగే అవకాశముంది.

రెండు లారీలు ఢీ..

క్యాబిన్ లో ఇరుక్కుని డ్రైవర్ మృతి

అక్షర దర్బార్, వరంగల్ ప్రతినిధి : హనుమకొండ– కరీంనగర్ జాతీయ రహదారిపై బుధవారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. హసన్ పర్తి ఎల్లమ్మ గుడి వద్ద రెండు లారీలు ఎదురెదురుగా ఢీ కొన్నాయి. ఈ ప్రమాదంలో లారీ క్యాబిన్ లో ఇరుక్కొని డ్రైవర్ అక్కడికక్కడే మృతిచెందారు. మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. మృతుడు సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలం బిల్యానాయక్ తండా వాసి బానోతు మోహన్ (40)గా గుర్తించారు. కాగా, ఘటనపై పోలీసులు విచారణ చేపట్టారు.

బీఆర్ఎస్‌తోనే రంజిత్ రెడ్డికి గుర్తింపు

- చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గం నేతలతో కేటీఆర్ సమావేశం
- కాంగ్రెస్ లో చేరిన ఎంపీ రంజిత్ రెడ్డిపై ఘాటు వ్యాఖ్యలు..

సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్

అక్షర దర్బార్, వరంగల్ ప్రతినిధి : బీఆర్ఎస్ పార్టీ నుంచి ఎంపీగా గెలిపించుకున్నాకే రంజిత్ రెడ్డి అంటే ఎవరో ప్రజలకు తెలిసిందని మాజీ మంత్రి కేటీఆర్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. బుధవారం చేవెళ్ల నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ నేతలతో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ 2019లో రాజకీయాలకు కొత్త అయినా పార్టీలోని ప్రతి కార్యకర్త కష్టపడి ఆయనను గెలిపించారని, రంజిత్ రెడ్డికి పార్టీలో అత్యధిక ప్రాధాన్యత ఇచ్చిన విషయాన్ని కేటీఆర్ గుర్తు చేశారు. కేవలం అధికారం, ఆస్తుల కోసమే బీఆర్ఎస్ పార్టీకి ద్రోహం చేసి కాంగ్రెస్ లో చేరారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్సీ కవితపైన ఈడీ దాడి చేసి, అరెస్టు చేసిన రోజే కాంగ్రెస్ పార్టీలో చేరిన స్వార్థపరుడు రంజిత్ రెడ్డి అని అన్నారు. గతంలో ఎన్నికలకు ముందు అప్పటి మాజీ ఎంపీ విశ్వేశ్వర్ రెడ్డి కూడా పార్టీ కన్నా తానే ఎక్కువ అనుకొని ఇతర పార్టీలోకి వెళ్లే ఫలితం ఏమైందో అందరికీ తెలుసునని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రంజిత్ రెడ్డి మిలాఖత్ అయినంత మాత్రాన.. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు క్షేత్రస్థాయిలో కలిసిపోతాయనుకోవడం వారి రాజకీయ అజ్ఞానానికి నిదర్శనమని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీలో తీవ్రమైన అయోమయ పరిస్థితి నెలకొందని, చేవెళ్లలో కాంగ్రెస్ పార్టీకి కనీసం అభ్యర్థి కూడా దొరకలేదని విమర్శించారు. సొంతంగా అభ్యర్థిలేని కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల, మల్కాజిగిరి, సికింద్రాబాదులో గెలవడం అసాధ్యమని జోష్యం చెప్పారు. చేవెళ్ల నియోజకవర్గంలో 13న కేసీఆర్ బహిరంగ సభ ఉంటుందని ప్రకటించారు. కాసాని జ్ఞానేశ్వర్ గెలుపు నల్లేరు మీద నడకే అని కేటీఆర్ విశ్వాసం వ్యక్తం చేశారు. ముదిరాజులతో పాటు బీసీల కోసం కొన్ని దశాబ్దాలుగా అండగా నిలబడిన వ్యక్తి కాసాని జ్ఞానేశ్వర్ అని కొనియాడారు.

అధికారులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి

శిక్షణ తరగతులను పరిశీలించిన జిల్లా అదనపు కలెక్టర్..

అక్షర దర్బార్, పరకాల : పీవో, ఓపీవోల మొదటి దఫా శిక్షణా తరగతులు పరకాల ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహిస్తుండగా బుధవారం హనుమకొండ అదనపు కలెక్టర్ ఎ.వెంకట్ రెడ్డి (రెవెన్యూ) పరిశీలించారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, రెవెన్యూ డివిజనల్ అధికారి, పరకాల తహసీల్దార్ కు తగు సూచనలను అందజేశారు. అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయాలను సందర్శించారు.

మరిపెడ ప్రెస్ క్లబ్ నూతన కమిటీ ఎన్నిక

అధ్యక్షుడు, పర్వతం చంద్రశేఖర్

ప్రధాన కార్యదర్శి, మారం అనంతరాములు

అక్షర దర్బార్, మరిపెడ : మరిపెడ ప్రెస్ క్లబ్ కమిటీని బుధవారం ఏక గ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా గండి విష్ణు(టీవీ5), అధ్యక్షుడిగా పర్వతం చంద్రశేఖర్(ఆంధ్ర ప్రభ), ప్రధాన కార్యదర్శిగా మారం అనంతరాములు (ఆంధ్ర జ్యోతి), కోశాధికారిగా బోడపట్ల సతీష్(అక్షర విజేత)ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా రేఖ అశోక్(ప్రజా సాక్షి), మూడావత్ రవి(నినాదం), సహాయ కార్యదర్శులుగా మాడు శ్రీకుమార్, బాశిపంగు వెంకన్న, గౌరవ సలహాదారులుగా దాసరోజు బాలకృష్ణ(నమస్తే తెలంగాణ), వంకాయలపాటి తిరుమలరావు(మనం), కారంపూడి వెంకటేశ్వర్లు(తొలి అక్షరం)ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యల పరిష్కారం దిశగా పనిచేస్తూ, వారి సంక్షేమానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో జర్నలిస్టులు గండి నాగరాజు, పులుసు సతీష్, దేవరశెట్టి శ్రీశైలం, బోడ శ్రీను, తిరుపతి, మహేందర్, చింతా వెంకన్న, ఉపేందర్, రాంపల్లి కపిల్, గందిసిరి ఉప్పలయ్య, ఉప్పల రమేష్, బోడపట్ల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డిని సన్మానిస్తున్న ఆలయ నిర్వాహకులు

కేశవాపురంలో కొనసాగుతున్న అష్టాదశ బ్రహ్మోత్సవాలు..

పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే రేవూరి

దుగ్గొండి అక్షర దర్బార్ : దుగ్గొండి మండలంలోని కేశవాపురం శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో అష్టాదశ బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. నాలుగో రోజైన బుధవారం భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. కాగా, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి స్వామి వారిని దర్శించుకుని పట్టు వస్త్రాలు సమర్పించారు. అనంతరం ఆలయ వ్యవస్థాపకులు కంది జితేందర్ రెడ్డి దంపతులు ఎమ్మెల్యేను సన్మానించి, స్వామి వారి ప్రసాదాలు అందజేశారు.

ఛత్తీస్‌ఘడ్‌లో భారీ ఎన్‌కౌంటర్

ఆరుగురు మావోయిస్టులు మృతి

అక్షర దర్బార్, బీజాపూర్ : ఛత్తీస్ ఘడ్ రాష్ట్రం బీజాపూర్ సమీపంలో బుధవారం భారీ ఎన్ కౌంటర్ జరిగింది. పోలీసులకు మావోయిస్టులకు మధ్య జరిగిన కాల్పుల్లో ఆరుగురు మావోయిస్టులు మృతి చెందారు. ఈ ఎన్ కౌంటర్ జరిగిన ప్రాంతంలోనే హోలీ పండుగ రోజున మావోయిస్టులు ముగ్గురిని హత మార్చిన విషయం విధితమే. కాగా, ఘటనా స్థలంలో ఒక డిప్యూటీ కమాండర్ సహా ఆరుగురి మావోయిస్టుల మృతదేహాలు లభ్యమయ్యాయి. ఇందులో ఒక మహిళ కూడా ఉంది. బాసగూడ పోలీస్ స్టేషన్ పరిధిలోని బీజాపూర్ సుక్మా సరిహద్దు ప్రాంతంలో చీపుర్భట్టి ప్రాంతంలో భద్రతా బలగాలు, మావోయిస్టుల మధ్య కాల్పులు జరిగాయి. కోబ్రా, సీఆర్పీఎఫ్, డీఆర్జీ జవాన్లు ఈ కాల్పుల్లో పాల్గొన్నట్లు తెలిసింది. ఘటనా స్థలాన్ని ఎస్పీ జితేంద్ర కుమార్ యాదవ్, కోబ్రా సీఆర్పీఎఫ్ అధికారులు పరిశీలించారు. ఘటనతో ఆ ప్రాంతంలో పరిస్థితి మరోసారి వేడెక్కింది. దీంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.

తాగునీటి సరఫరాపై అప్రమత్తంగా ఉండాలి

హనుమకొండ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

అక్షర దర్బార్, హనుమకొండ: గ్రామాల్లో తాగునీటి సరఫరాకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పకడ్బందీగా చర్యలు చేపట్టాలని గ్రామీణ నీటి సరఫరా శాఖ అధికారులను హనుమకొండ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆదేశించారు.బుధవారం కలెక్టరేట్లో గ్రామీణ నీటి సరఫరా శాఖ అధికారులతో సమ్మర్ యాక్షన్ ప్లాన్ పై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సిక్తా పట్నాయక్ మాట్లాడుతూ.. వేసవికాలం దృష్ట్యా గ్రామాల్లో తాగునీటి సరఫరాపై అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. సమావేశంలో గ్రామీణ నీటి సరఫరా శాఖ డీఈలు సునీత, శ్వేత, చంద్రు నాయక్, జీవన్ ప్రకాష్, శ్రీనివాస్, ఏఈలు పాల్గొన్నారు.

బతకడానికి వచ్చి బలవన్మరణం

జనగామలో తమిళనాడుకు చెందిన దంపతుల ఆత్మహత్య

అక్షర దర్బార్, వరంగల్ ప్రతినిధి : కుటుంబ కలహాలతో దంపతులు బలవన్మరణానికి పాల్పడిన ఘటన బుధవారం జనగామ జిల్లా కేంద్రంలో జరిగింది. తమిళనాడుకు చెందిన సెల్వరాజు (55), భాగ్యలక్ష్మి (50) జిల్లా కేంద్రంలోని వీవర్స్ కాలనీలో నివాసముంటున్నారు. రెండు దశాబ్దాల క్రితం బతుకుదెరువు కోసం జనగామకు వచ్చి, చిరు వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో వారి కుటుంబంలో కలహాలు ఏర్పడ్డాయి. దీంతో తీవ్ర మనస్తాపం చెందిన భార్యాభర్తలు తెల్లవారుజామున కిరోసిన్ పోసుకుని నిప్పంటించుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఘటనా స్థలానికి పోలీసులు చేరుకొని మృతదేహాలను మార్చురీకి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

అక్షర దర్బార్
voice of the people
తెలుగు దినపత్రిక

అసమర్ధ పాలనతో రైతులు ఆగం..

- నీళ్లు లేక పంటలు ఎండుతున్నాయి..
- రైతులకు తక్షణమే నష్ట పరిహారం అందించాలి
- మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి

అక్షర దర్బార్, రేగొండ: కాంగ్రెస్ అసమర్ధ పాలనతో రైతుల పరిస్థితి అగమ్య గోచరంగా మారిందని భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి అన్నారు. బుధవారం ఆయన బీఆర్ఎస్ నాయకులతో కలిసి మండలంలోని రంగయ్యపల్లి గ్రామంలో నీళ్లు లేక ఎండిపోయిన వరి పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రాకతో రైతుల కష్టాలు మొదలయ్యాయని, చెరువుల కింద సాగుచేసిన వరి పొలాలు చేతికొచ్చే సమయానికి నీళ్లు లేక ఎండిపోతున్నాయని మండిపడ్డారు. డీబీఎం 38, ఎస్సారెస్పీ కాలువల ద్వారా నీళ్లు పంపించి వెంటనే చెరువులను నింపి రైతులను ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ పాలనలో రైతులు రెండు పంటలతో సుభిక్షంగా వ్యవసాయం చేశారని, బూటకపు హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల అవసరాలు మరిచిందని విమర్శించారు. రుణమాఫీ లేదు, రైతు భరోసా కింద రూ.15 వేలు ఇంకా అమలు కాలేదని విమర్శించారు. వరి సాగుతో నష్టపోయిన రైతులకు రూ.25వేల నష్టపరిహారం తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు అంకం రాజేందర్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ సామల పాపిరెడ్డి, కొటంచ మాజీ ఆలయ చైర్మన్ మాదాడి అనిత కరుణాకర్ రెడ్డి, రంగయ్యపల్లి మాజీ సర్పంచ్ దగ్గు సంధ్యారాణి వెంకటేశ్వరరావు, నాయకులు పసుల అశోక్, దాట్ల రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఎండిన వరి పంటను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే వెంకట రమణ రెడ్డి

మృతుడి కుటుంబానికి మొలుగూరి పరామర్శ..

అక్షర దర్బార్, పరకాల : పరకాల పట్టణంలోని 19వ వార్డుకు చెందిన వలిపిరెడ్డి నారాయణ అనారోగ్యంతో బుధవారం మృతిచెందాడు. కాగా, కాంగ్రెస్ పార్టీ నాయకుడు, పరకాల మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి బాధిత కుటుంబాన్ని పరామర్శించి, నారాయణకు నివాళులర్పించారు. ఆయనవెంట కాంగ్రెస్ నాయకులు దుబాసి వెంకటస్వామి, మెరుగు శ్రీశైలం, సీనియర్ జర్నలిస్టులు మెండు రవీందర్, రేపాల నర్సింహారాములు ఉన్నారు.

నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే భిక్షపతి

నోడల్ అధికారులదే కీలక పాత్ర

జిల్లా ఎన్నికల అధికారి పి. ప్రావీణ్య

అక్షర దర్బార్, వరంగల్ ప్రతినిధి : ఎన్నికల నిర్వహణలో నోడల్ అధికారులదే కీలక పాత్ర అని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.ప్రావీణ్య అన్నారు. బుధవారం జిల్లా కలెక్టరేట్ లో జీడబ్ల్యూఎంసీ కమిషనర్ అశ్విని తానాజీ వాఖేడే, హనుమకొండ, వరంగల్ జిల్లాల అదనపు కలెక్టర్లు రాధిక గుప్తా, సంధ్యారాణితో కలిసి సార్వత్రిక ఎన్నికలకు నియమించిన ఆయా విభాగాల నోడల్అధికారులతో సమావేశం నిర్వహించి పలు అంశాలపై దిశానిర్దేశం చేశారు. నోడల్అధికారులు పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని 7 అసెంబ్లీ సెగ్మెంట్ల సిబ్బందితో కలిసి సమన్వయంతో పని చేసి సమగ్ర నివేదికలను నిర్దేశిత కాలంలో తప్పని సరిగా పంపాలని ఆదేశించారు. ప్రతి ఉద్యోగి ఖచ్చితంగా ఓటు హక్కు వినియోగించుకొనుటకు ఫారం-12 సమర్పించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఎన్నికల సందర్భంగా వచ్చే ఫిర్యాదులను వెంటనే పరిష్కరించడం, సి- విజిల్ ద్వారా వచ్చే ఫిర్యాదులకు తక్షణమే స్పందించి పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సమావేశంలో డీసీపీ రవీందర్, డీఆర్వోలు శ్రీనివాస్, గణేష్, ఆర్డీవోలు దత్తు, కృష్ణవేణి, ఎన్నికల నోడల్ అధికారులు, కలెక్టరేట్ పరిపాలన అధికారి శ్రీకాంత్, ఎన్నికల పర్యవేక్షకులు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య

వచ్చే ఏడాదిలో ఎమ్మెల్సీగా కొండా మురళీ

- స్పష్టం చేసిన మంత్రి సురేఖ
- ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని ప్రారంభించిన కొండా దంపతులు

అక్షర దర్బార్, వరంగల్ ప్రతినిధి : 2025లో కొండా మురళీ ఎమ్మెల్సీ అవుతారని దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ వెల్లడించారు. వరంగల్ తూర్పు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని కొండా దంపతులు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ దేవాదాయ శాఖకు చెందిన భూములను కాపాడుతామని అన్నారు. ఆస్తులకు సంబంధించి పత్రాలను పకడ్బందీ చేస్తామని పేర్కొన్నారు. చారిత్రాత్మకమైన వరంగల్ జిల్లాను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని స్పష్టం చేశారు. ఈ ఏడాదే మురళీ ఎమ్మెల్సీ కావాల్సి ఉండే కానీ తక్కువగా సీట్లు ఉన్న కారణంగా అవకాశం రాలేదన్నారు. 2025లో పదుల సంఖ్యలో ఎమ్మెల్సీల ఖాళీలు ఏర్పడుతున్నాయని, వాటిలో ఒక సీటును కచ్చితంగా కొండా మురళీతో భర్తీ చేస్తారని ప్రకటించారు. కొత్తగా కాంగ్రెస్ పార్టీలో చేరిన వారితో పాత వారికి ఎలాంటి ఇబ్బంది లేకుండా చూస్తున్నామని తెలిపారు. పాత, కొత్త వారిని రెండు కండ్లలాగా చూస్తామన్నారు. గురువారం నుంచి క్యాంపు కార్యాలయంలో అందుబాటులో ఉంటామన్నారు. తాను లేని సందర్భంలో ఇద్దరు పీఏలు, ఇతర సిబ్బంది ఉంటారని తెలిపారు. ప్రజల నుంచి వారు దరఖాస్తులు తీసుకొని మా దృష్టికి తీసుకువస్తారని చెప్పారు. ప్రతి వినతి పత్రాన్ని సంబంధిత అధికారుల వద్దకు తీసుకెళ్లి సమస్య పరిష్కారమయ్యే విధంగా చూస్తామని హామీ ఇచ్చారు. నేతలు ప్రజల వద్ద డబ్బులు వసూలు చేసి పార్టీకి, కొండా దంపతులకు చెడ్డ పేరు తీసుకురావద్దని హితవు పలికారు.

మాట్లాడుతున్న మంత్రి కొండా సురేఖ

సీఎంఆర్ లక్ష్యాలను పూర్తి చేయాలి

జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

అక్షర దర్బార్, జనగామ: 2023-24 వానాకాలం సీఎంఆర్ లక్ష్యాలను త్వరితగతిన పూర్తి చేయాలని జనగామ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలోని మినీ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) రోహిత్ సింగ్ తో కలిసి రైస్ మిల్లర్లతో వానాకాలం సీఎంఆర్ లక్ష్యాలపై కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇప్పటివరకు జిల్లాలో వానాకాలం సీఎంఆర్ లక్ష్యం 21 శాతంగా ఉందని పేర్కొన్నారు. అలాగే ఈ సీజన్లో 80,864 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుమతైందన్నారు. ఇందులో కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) 54,179 మెట్రిక్ టన్నులు కాగా 11,350 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ రైస్ డెలివరీ పూర్తయిందని అన్నారు. మిగిలిన ధాన్యం లక్ష్యాలను త్వరితగతిన పూర్తిచేయాలని మిల్లర్లను ఆదేశించారు. జిల్లాలో బాయిల్డ్, రా రైస్ మిల్లర్లు రోజువారీ లక్ష్యాలను పూర్తి చేయాలని సూచించారు. సీఎంఆర్ లక్ష్యాలపై ఎవరైనా మిల్లర్లు అలసత్వం వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో పౌరసరఫరాల అధికారిణి ఎం.రోజా రాణి, సివిల్ సప్లయ్ మేనేజర్ డీఎం ప్రసాద్, డీటీ సీఎస్ శ్రీనివాస్, దేవా, మిల్లు అధ్యక్షుడు బెల్దీ వెంకన్న, బజ్జూరి జయ హరి, శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

బీఎస్పీ వరంగల్ పార్లమెంట్ ఇన్చార్జ్‌గా రాజు

అక్షర దర్బార్, పరకాల : బీఎస్పీ వరంగల్ పార్లమెంట్ ఇన్చార్జ్‌గా నడికూడ మండలం నార్లాపూర్ గ్రామానికి చెందిన శనిగరపు రాజును ఆపార్టీ రాష్ట్ర అధ్యక్షులు, తెలంగాణ బహుజన సిద్ధాంత కర్త మంద ప్రభాకర్ నియమించారు.

ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తిని కాపాడిన హోంగార్డ్

- సకాలంలో స్పందించిన పోలీస్
- రెప్పపాటులో తప్పిన ప్రమాదం
- సోషల్ మీడియాలో వీడియో వైరల్
- హోంగార్డును అభినందించిన ఉన్నతాధికారులు

అక్షర దర్బార్, వరంగల్ ప్రతినిధి : రైలు కింద పడి ఆత్మహత్యకు సిద్ధమైన వ్యక్తిని హోంగార్డ్ కాపాడిన ఘటన వరంగల్ లో బుధవారం జరిగింది. ఉత్తరాఖండ్ కు చెందిన హితోవ సోను రైలు పట్టాలపై పడుకుని ఆత్మహత్యకు యత్నించగా స్థానికులు గుర్తించి కేకలు వేశారు. వెంటనే అండర్ బ్రిడ్జి వద్ద ట్రాఫిక్ విధులు నిర్వర్తిస్తున్న హోంగార్డ్ వై.రవి స్పందించి పరుగెత్తుకుంటూ వచ్చి వ్యక్తిని పట్టుకుని పరుగు తీశాడు. రెప్పపాటు సమయానికే రైలు అక్కడి నుంచి వెళ్లింది. దీంతో అక్కడున్న వారంతా ఊపిరి పీల్చుకున్నారు. ఇదంతా వీడియో తీసిన ఓ వ్యక్తి సోషల్ మీడియాలో పోస్టు చేయడంతో వైరల్ అయింది. పెయింటర్ గా పని చేస్తున్న సోను జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్యకు యత్నించినట్లు పేర్కొన్నాడు. కాగా, హోంగార్డ్ ను ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ, ఇన్ స్పెక్టర్ శ్రీధర్ అభినందించారు.

దళారులను ఆశ్రయించొద్దు

- ఆన్ లైన్ లో స్లాట్ బుక్ చేసుకుని నేరుగా పనులు చేసుకోవచ్చు
- అందుబాటులో పద్దెనిమిది రకాల సేవలు
- ఏప్రిల్ తొలి వారం నుంచి టీజీ కార్డులు
- పోస్టు ద్వారా లైసెన్సు, ఆర్సీ అందని వాహనదారులు ఆఫీసులో పొందవచ్చు
- క్వార్టర్లీ ట్యాక్స్ ఏప్రిల్ నెలాఖరులోగా చెల్లించాలి
- 'అక్షర దర్బార్' తో డీటీసీ డాక్టర్ పుప్పాల శ్రీనివాస్



అక్షర దర్బార్, వరంగల్ ప్రతినిధి:

హనుమకొండ చింతగట్టు కేంద్రంగా పని చేస్తున్న రవాణా శాఖ జిల్లా కార్యాలయం ఇన్నాళ్లు అవినీతికి కేరాఫ్ గా నిలిచింది. లైసెన్స్, రిజిస్ట్రేషన్, ఇతర పనుల కోసం వాహనదారులు ఈ కార్యాలయంలో దళారులను ఆశ్రయించారు. ఇక్కడ వాహనదారులు ఈ కార్యాలయంలో బ్రోకర్లను సంప్రదించకుండా నేరుగా అధికారులను కలిస్తే పనులు జరగని పరిస్థితి కొనసాగింది. ప్రతి పనికి ఒక రేటు ఫిక్స్ చేసి వసూళ్లకు పాల్పడటం ద్వారా దళారులు వాహనదారుల జే బులను లూటీ చేశారు. ఇటీవల బదిలీపై ఇక్కడికి ర వాణా శాఖ వరంగల్ ప్రాంతీయ డిప్యూటీ కమిషనర్ (డీటీసీ)గా వచ్చిన డాక్టర్ పుప్పాల శ్రీనివాస్ హనుమ కొండ ఈ కార్యాలయంలో అవినీతి మరకలను తు డిచి వేసే పనిలో పడ్డారు. ఆర్టీవో కార్యాలయంలో త మ పనుల కోసం వాహనదారులు ఎవరు కూడా దళారులను ఆశ్రయించవద్దని చెపుతున్నారు. నేరుగా ఆన్ లైన్ లో స్లాట్ బుక్ చేసుకుని ఈ కార్యాలయంలో సులువుగా తమ పనులు చేసుకోవాలని కోరుతున్నారు. ఇందుకోసం అవసరమైన ఏర్పాట్లు చేశామని అంటున్నారు. ముఖ్యంగా అనేక ఆరోపణలు ఎదుర్కొంటున్న ఈ కార్యాలయంలో వాహనదారులకు రవాణా శాఖ నుంచి మెరుగైన సేవలను అందించే దిశగా అడుగులు వేస్తున్నారు. వాహనదారులు తమ ఆఫీసులో సమస్యలేమైనా ఎదురైతే తనను కలవచ్చని డీటీసీ డాక్టర్ పుప్పాల శ్రీనివాస్ అన్నారు. గత ఫిబ్రవరి 19న ఇక్కడ డీటీసీగా బాధ్యతలు చేపట్టిన ఆయన బుధవారం 'అక్షర దర్బార్' తో మాట్లాడారు.

ఆఫీసుకు రాకుండా పని చేసుకోవచ్చు

రవాణా శాఖ హనుమకొండ జిల్లా కార్యాలయం వద్ద ఇన్నాళ్లు వాహనదారులకు పని చేసి పెట్టిన దళారులకు ఇకనుంచి ఇక్కడ కనపడద్దని చెప్పడం జరిగింది. ఈ ఆఫీస్ లో పనులు చేసి పెడతామని వాహనదారుల నుంచి డబ్బు తీసుకున్నట్లు తెలిస్తే దళారులపై చర్యలు తీసుకుంటామని కూడా ప్రకటించాం. వాహనదారులు రవాణా శాఖ కార్యాలయానికి రాకుండా ఇంటి నుంచే పని చేసుకునే అవకాశం ఉంది. లైసెన్సు, వాహన రిజిస్ట్రేషన్, ఇతర పనుల కోసం గానీ ఆన్ లైన్ లో స్లాట్ బుక్ చేసుకోవచ్చు. 18 రకాల సేవలను రవాణా శాఖ అందుబాటులో ఉంచింది. ఫోన్ ద్వారా కూడా బుక్ చేసుకోవచ్చు. నేరుగా స్లాట్ బుక్ చేసుకొన్న తర్వాత డీటీఓ కార్యాలయానికి వచ్చి తమ పనులను చేసుకోవచ్చు. ఆఫీసు వద్ద ఇబ్బందులేమైనా ఎదురైతే వాహనదారులు తనను కలిసి చెప్పవచ్చు. దళారులతో అవసరం లేకుండా పనులు జరిగేలా ఏర్పాట్లు చేశాం.

త్వరలో టీజీ కార్డులు

ఈనెల 15 నుంచి టీజీ రిజిస్ట్రేషన్ ప్రారంభమైంది. టీజీ పేరుతోనే రవాణా శాఖ కార్యాలయాల్లో వాహనాల రిజిస్ట్రేషన్ జరుగుతుంది. అయితే కార్డులు రావాల్సి ఉంది. అందువల్ల ప్రస్తుతం రిజిస్ట్రేషన్ చేసుకుంటున్న వాహనదారులకు టీజీ కార్డులు పంపలేకపోతున్నాం. ఏప్రిల్ మొదటి వారంలో టీజీ కార్డులు వచ్చే అవకాశం ఉంది. కార్డులు రాగానే ముద్రించి వాహనదారులకు పోస్టు ద్వారా పంపిస్తాం.

కార్యాలయంలో పొందవచ్చు

అడ్రస్ సరిగా లేకపోవడం, ఫోన్ నెంబర్ తప్పుగా పడ టం, ఇతర కారణాలవల్ల వాహనదారులకు కొందరికి లైసెన్సు, ఆర్సీ గాని పోస్ట్ ద్వారా అందలేదని గుర్తిం చాం. రవాణా శాఖ హనుమకొండ జిల్లా కార్యా లయం పరిధిలోనే దాదాపు మూడు నుంచి నాలుగు వేల లైసెన్సులు, ఆర్సీలు కార్యాలయానికి తిరిగి వచ్చాయి. అడ్రస్, ఫోన్ నెంబర్స్ ప్రాబ్లమ్స్ ఇందుకు కారణం. అయితే లైసెన్సు, ఆర్సీ పోస్టు ద్వారా అందని వాహనదారులు నేరుగా చింతగట్టులోని డీటీఓ కార్యాలయానికి వచ్చి తమ లైసెన్సు, ఆర్సీ గాని నేరుగా పొందవచ్చు. పని దినాల్లో మధ్యాహ్నం రెండు గంటల తర్వాత ఈ కార్యాలయంలోని ఒకటో నెంబర్ కౌంటర్ లో లైసెన్సులు, ఆర్సీలు గాని సదర్ వాహనదారులు పొందే అవకాశం కల్పించాం.

ఏప్రిల్ నెలాఖరులోగా ట్యాక్స్ చెల్లించాలి

క్వార్టర్లీ టాక్స్ చెల్లించే ట్రాన్స్ పోర్ట్ వాహనాల యజమానులు టాక్స్ ఏప్రిల్ నెలాఖరులోగా చెల్లించాలి. టాక్స్ చెల్లించే గడవు ఈ నెలాఖరుతో ముగిసిపోనుంది. అయితే మార్చి 31 నుంచి ఏప్రిల్ 30వ తేదీ వరకు గ్రేస్ పీరియడ్ ఉంటుంది. ఫైన్ పడదు. లారీలు కమర్షియల్ ట్రాక్టర్లు ఇతర వాహనాల యజమానులు తమ క్వార్టర్లీ ట్యాక్స్ ను ఫైన్ లేకుండా చెల్లించవచ్చు. మే ఒకటవ తేదీ నుంచి టాక్స్ పై వంద శాతం ఫైన్ పడుతుంది. రవాణా శాఖ అధికారుల తనిఖీల్లో ట్యాక్స్ చెల్లించని వాహనాలు దొరికితే రెండొందల శాతం పెనాల్టీ పడుతుంది.

తాడిచర్ల పీఏసీఎస్ చైర్మన్‌పై వీగిన అవిశ్వాసం

అక్షర దర్బార్, మల్హార్ : తాడిచర్ల పీఏసీఎస్ చైర్మన్ చేప్యాల రామారావుపై డైరెక్టర్లు ఇచ్చిన అవిశ్వాస తీర్మానం వీగిపోయినట్లు జిల్లా అధికారి శైలజ పేర్కొన్నారు. మంగళవారం నిర్వహించాల్సిన అవిశ్వాస తీర్మానం అడ్మినిస్ట్రేషన్ కారణమంటూ బుధవారం రోజుకు వాయిదా వేశారు. కాగా, నేటి అవిశ్వాస తీర్మాన సమావేశానికి నోటీస్ ఇచ్చిన సభ్యులు గైర్హాజర్ కావడంతో ప్రస్తుత చైర్మన్ చేప్యాల రామారావు చైర్మన్ గా పూర్తి బాధ్యతలు నిర్వహించనున్నట్లు ఆమె సహకార సంఘంలో మొత్తం 13 మంది డైరెక్టర్లకు 8 మంది బీఆర్ఎస్, ఐదుగురు కాంగ్రెస్ డైరెక్టర్లు ఉన్నారు. రామారావుపై అవిశ్వాస తీర్మానం నోటీసు ఇచ్చిన డైరెక్టర్లలో వైస్ చైర్మన్ పదవి చేపట్టిన మల్కా ప్రకాష్, డైరెక్టర్ బానోత్ సర్వే నాయక్ బీఆర్ఎస్ నుంచి ఇటీవల కాంగ్రెస్ గూటికి చేరారు. ఈ పరిణామంతో కాంగ్రెస్ పార్టీ డైరెక్టర్లు ఏడుగురు సభ్యులతో అవిశ్వాస తీర్మానానికి నోటీస్ ఇచ్చారు. సమావేశానికి కాంగ్రెస్ పార్టీ డైరెక్టర్లు గైర్హాజర్ కావడంతో అవిశ్వాసం వీగిపోయిందని ఆమె ప్రకటించారు.

31న సీఈసీ సమావేశం

8 నియోజకవర్గాలకు కాంగ్రెస్ పార్టీలో ఎటూ తేలని అభ్యర్థులు

అక్షర దర్బార్, హైదరాబాద్ : తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో 8 లోక్ సభ స్థానాలకు అభ్యర్థులు ఎవరో ఇంకా తేలలేదు. 17స్థానాల్లో 9 స్థానాలకు ఇప్పటికే ప్రకటించిన కాంగ్రెస్ మరో 8 స్థానాల కోసం కసరత్తు చేస్తోంది. బుధవారం ఢిల్లీలో జరిగిన పార్టీ కేంద్ర ఎన్నికల కమిటీ సమావేశంలో అభ్యర్థులు తేలిపోతారని అంతా భావించారు. కానీ పార్టీ అన్ని అంశాలను చర్చించి అభ్యర్థులు ఎవరో తేల్చకుండానే సమావేశం ముగించారు. ఈ నెల 31న మరోసారి సీఈసీ సమావేశం జరగనుంది. పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అధ్యక్షతన జరిగిన సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, సీఈసీ సభ్యుడు ఉత్తమ్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు. ఖమ్మం, భువనగిరి స్థానాలపై ఉత్కంఠ నెలకొంది. వరంగల్, కరీంనగర్ స్థానలపై కొలిక్కి వచ్చినట్లు తెలుస్తోంది.

వ్యర్థాల నుంచి ఆదాయాన్ని సమకూర్చుకోవాలి

భూపాలపల్లి కలెక్టర్ భవేష్ మిశ్రా

అక్షర దర్బార్, జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి : వ్యర్థాలు నుంచి ఆదాయం సమకూరే విధంగా మున్సిపాలిటీని తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా మున్సిపల్ అధికారులను ఆదేశించారు. బుధవారం భూపాలపల్లి మున్సిపల్ కార్యాలయంలో మంచినీటి సరఫరా, ఇంటి పన్నుల వసూళ్లు, వ్యర్థాలు సేకరణ తదితర అంశాలపై మున్సిపల్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంచినీటి సరఫరాపై ప్రజల నుంచి ఫిర్యాదుల స్వీకరణకు తక్షణమే మున్సిపల్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలన్నారు. డ్రైనేజీల్లో వ్యర్థాలను తొలగించి పరిశుభ్రం చేయాలని తెలిపారు. డ్రైనేజీల ఆక్రమణను అరికట్టాలని, నిర్మాణాలను తొలగించేందుకు సంబంధిత యజమాలకు నోటీసు జారీ చేయాలని పేర్కొన్నారు. అయినప్పటికీ తొలగించకపోతే మున్సిపాలిటీ ద్వారా తొలగించిన వ్యయాన్ని వసూలు చేయాలని అన్నారు. అనుమతులు లేని నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

మాట్లాడుతున్న కలెక్టర్ భవేష్ మిశ్రా

ఇంటింటి నుండి వ్యర్థాల సేకరణ జరగాలని పేర్కొన్నారు. నిర్మాణం పూర్తయిన డీఆర్సీ భవనాన్ని వినియోగంలోకి తీసుకురావాలని సూచించారు. 71 శాతం మాత్రమే ఇంటి పన్నులు వసూలు చేశారని, మిగిలిన 29 శాతం పన్నుల వసూళ్లకు చర్యలు చేపట్టాలని తెలిపారు. పన్నులు వసూళ్లు తక్కువ చేసిన సిబ్బందికి షోకాజ్ నోటీస్ జారీ చే యాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, మున్సిపల్ కమిషనర్ రాజేశ్వరరావు, డీఈ త్రినాథ్, ఏఈ మానస, మేనేజర్ స్వామి, డీపీవో సునీల్, ఆర్ఐ భాస్కర్ పాల్గొన్నారు.

రెండు టిప్పర్లు, జేసీబీ సీజ్..

- ముగ్గురుపై కేసు నమోదు
- అక్రమంగా ఇసుక తరలిస్తే చర్యలే.. : సీఐ నరేష్ కుమార్

అక్షర దర్బార్, జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి : అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న వ్యక్తులను పట్టుకుని కేసు నమోద చేసినట్లు భూపాలపల్లి ఎస్సై సుధాకర్ తెలిపారు. వజినపల్లి గ్రామంలో బుధవారం తన సిబ్బందితో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా రెండు టిప్పర్లు, జేసీబీ సాయంతో గట్టు శ్రావణ్, ధరావత్ సురేష్, మస్న అనిల్ అనే ముగ్గురు వ్యక్తులు ఇసుక రవాణా చేస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. రెండు టిప్పర్లు, జేసీబీని సీజ్ చేసి ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అక్రమంగా ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ నరేష్ కుమార్ హెచ్చరించారు.

ఆ డబ్బు ఎక్కడుందో కేజ్రీవాల్ చెబుతారు

కేజ్రీవాల్ భార్య సునీత సంచలన ప్రకటన

అక్షర దర్బార్, ఢిల్లీ: మద్యం పాలసీకి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో తన అరెస్టును సవాల్ చేస్తూ ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద కేజ్రీవాల్ దాఖలు చేసిన పిటీషన్ పై హైకోర్టులో విచారణ జరుగుతోంది. ఈ సమయంలో ఆయన సతీమణి సునీత సంచలన ప్రకటన చేశారు. లిక్కర్ స్కాంలో నిజానిజాలను తన భర్త గురువారం కోర్టులో బయటపెట్టనున్నట్లు వెల్లడించారు. ఈ మేరకు ఆమె వీడియో సందేశం విడుదల చేశారు. ''నా భర్తను అరెస్టు చేసి కస్టడీలోకి తీసుకున్నారు. ఆయనకు ఆరోగ్యం సరిగా లేదు. డయాబెటిస్ తో బాధపడుతున్నారు. కస్టడీలోనూ ఆయన ప్రజల గురించే ఆలోచిస్తున్నారు. అక్కడి నుంచే నీటి సమస్యను నివారించాలని రెండు రోజుల క్రితం మంత్రి ఆతిశీకి లేఖ పంపారు. దీన్ని కూడా కేంద్ర ప్రభుత్వం సమస్యగా మార్చింది. ఆయనపై కేసులు పెడుతోంది. ఢిల్లీని నాశనం చేయాలని కేంద్రం కోరుకుంటున్నది. ఈ పరిణామాలతో ఆయన ఆందోళనకు గురవుతున్నారు. మద్యం కేసుకు సంబంధించి ఈడీ ఇప్పటివరకు 250 సార్లకు పైగా సోదాలు జరిపింది. ఎందులోనూ వారికి ఏమీ దొరకలేదు. ఈ కేసుకు సంబంధించి మార్చి 28న కోర్టులో అన్ని నిజాలు బయటపెడతానని కేజ్రీవాల్ చెప్పారు. లిక్కర్ స్కాం డబ్బు ఎక్కడుందో ఆయన న్యాయస్థానంలో చెబుతారు. అందుకు తగిన ఆధారాలు కూడా ఇస్తారు'' అని సీఎం సతీమణి వెల్లడించారు. కేజ్రీవాల్ నిజమైన దేశభక్తుడని, ధైర్యం గల నేత అని కొనియాడారు. ఈ కేసులో మార్చి 21న కేజ్రీవాల్ ను అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ఆయన కస్టడీ గురువారంతో ముగియనుంది. దర్యాప్తు అధికారులు ఆయనను కోర్టులో హాజరుపర్చనున్నారు